

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

జగిత్యాల: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. 97.1శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు అధికారులు వివరించారు.



పంటపొలాల పరిశీలన

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస శాస్త్రవేత్తల బృందం కోరుట్ల మండలం అయిలాపూర్, కల్లూరు గ్రామాల్లోని వరిపొలాలను శనివారం పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
26.0/18.0

వాతావరణం

వాతావరణం చల్లబడుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. చలిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం స్వల్పంగా ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈ సారు మాకొద్దు



ఆందోళన చేస్తున్న కార్మికులు

జగిత్యాల: జగిత్యాలలో మున్సిపల్ కార్మికులు ఈ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాకొద్దంటూ శనివారం వేకువజామున మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె ఎల్లం ఆదివారం సైతం విధుల్లోకి రావాలని ఒత్తిడి తెస్తూ ఇబ్బంది పెడుతున్నాడని ఆరోపించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆదివారం ప్రతీఒక్కరికి సెలవు ఉంటుందని, విడతల వారీగా కొందరు మాత్రమే విధులు నిర్వహిస్తారని, కానీ మొత్తం మంది విధుల్లోకి రావాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ కార్మికుల సమస్యలపై ఆరా తీశారు. కమిషనర్ దృష్టికి తీసుకురాకుండానే వారిని ఆదివారం ఎలా విధులకు రమ్మంటున్నావని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను మందలించి మెమో జారీ చేశారు.

అత్యధిక పన్ను వసూలు



పన్ను వసూలు చేస్తున్న అధికారులు

జగిత్యాల: జగిత్యాలలోని మెన్స్‌క్లబ్‌లో అత్యధికంగా మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న పన్నును రెవెన్యూ అధికారులు జరిమానాతో సహా వసూలు చేశారు. మొత్తం రూ.3,91,040 వసూలు చేశారు. ప్రతీఒక్కరు పన్ను కట్టాలని, ప్రజలందరూ సహకరిస్తేనే మున్సిపల్ అభివృద్ధి చెందుతుందని కమిషనర్ బోనగిరి నరేశ్ తెలిపారు. ఆయన వెంట ఆర్వో ప్రసాద్, టీపీఎస్ తేజస్విని పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడొద్దు



సదస్సులో పాల్గొన్న జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ప్రసాద్

జగిత్యాలజోన్: నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్ అన్నారు. జగిత్యాల స్పెషల్ సబ్‌జైలులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ.. క్షణికావేశంలో నేరాలు చేసి జైలు పాలవుతున్నారని అన్నారు. జైలు జీవితం ఓ గుణపాఠంలాగా మారి, బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని కోరారు. ఖైదీలకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలర్ మొగిలేశ్, హెడ్ వార్డర్ మజారొద్దీన్ ఉన్నారు.

బ్యాంకర్లతో సమావేశం

జగిత్యాలజోన్: జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన స్పెషల్ లోక్ అదాలత్‌లో జడ్జి ప్రసాద్ బ్యాంకర్లతో సమావేశమయ్యారు. బ్యాంకులకు సంబంధించిన వివిధ కేసులు పరిష్కరించారు. కొంతమంది ఖాతాదారులు బ్యాంకుల నుంచి సంతోషంగా రుణం తీసుకుంటున్నారు, చెల్లించేప్పుడు ఇబ్బందులకు గురిచేస్తున్నారని జడ్జికి వివరించారు. వివిధ బ్యాంకులకు సంబంధించిన సివిల్ కేసులు ఎక్కువగా లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూడాలని జడ్జి ప్రసాద్ బ్యాంకర్లను కోరారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ గౌతమ్ లక్ష్మీనారాయణ, వివిధ బ్యాంకుల సిబ్బంది ఉన్నారు.

భవన పనులు త్వరగా పూర్తిచేయాలి



జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా పోలీస్ కార్యాలయల సముదాయంలో పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. శనివారం భవన నిర్మాణ పనులు పరిశీలించారు. ధరూర్ క్యాంప్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న పోలీసు కార్యాలయ సముదాయ భవనాల నిర్మాణం పనులు, ఎస్పీ క్యాంప్ ఆఫీస్, ఎస్పీ రెసిడెన్షియల్, ఏఆర్ హెడ్ క్వార్టర్స్ పనులపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ప్లాన్ ప్రకారం మాత్రమే నిర్మాణ పనులు జరగాలని సూచించారు. ఆయన వెంట ఎస్పీ భాస్కర్ ఉన్నారు.

సండే స్పెషల్

మన బలగం

సిరిసిల్ల: ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దూరమైన నేటి రోజుల్లో మానవ సంబంధాలను గొప్పగా ఆవిష్కరించి అందరితోనూ కన్నీరు పెట్టించిన బలగం సినిమా రాజన్న సిరిసిల్ల జిల్లా పరిసరాల్లో చిత్రీకరించుకుంది. సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన యెల్దండి వేణు కమెడియన్‌గా సుపరిచితుడు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన బలగం సినిమా నిండా ఇక్కడి పల్లెలు.. స్థానికులే నటించారు.

ఆత్మీయతల కలయిక..

తల్లికి పుట్టి, పిల్లలుగా ఉన్నప్పుడు కలిసి మెలిసి ప్రాణంగా బతికిన అన్నాదమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లు పెద్దవాళ్లై పెళ్లి అవగానే చిన్నచిన్న విషయాలు, ఆస్తి తగాదాలకు కోపాలు పెంచుకుని.. హద్దులు గీసుకుని ఏళ్లకేళ్లు బతుకుతుంటారు. ఈ సినిమాలో ఇంటికొచ్చిన అల్లుడికి విలువ ఇవ్వడం లేదని, 'పూలుగ బొక్క'తో మొదలైన పంచాయితీ 20ఏళ్ల కూతురును తల్లిగారింటికి దూరం చేసింది. తన చెల్లిపై ప్రేమ ఉన్నా బావపై కోపంతో ప్రేమను అణచివేసుకుని మనసులో దుఃఖించిన వైనం గుండెలను హత్తుకుంటుంది. ప్రాణంపోయిన వ్యక్తికి పక్షికి పెడితే.. చనిపోయిన మనిషికి తృప్తి ఆ మటన్, చికెన్‌లో కాదు.. మానవ సంబంధాల్లో ఉంటుందని పక్షి ముట్టని వైనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. కొడుకులు, కూతురు కలిశాకే పక్షి ముట్టిన తీరు కన్నీరు పెట్టిస్తుంది.

సినిమా బృందంతో దర్శకుడు యెల్దండి వేణు





కోనరావుపేట మండలం కొలనూర్‌లోని ఇల్లు



సిరిసిల్లకు సినిమాకు వచ్చిన వృద్ధులు



సిరిసిల్లలో 'బలగం' ప్రీ రిలీజ్ ఫంక్షన్

- వెండితెరపై మెరిసిన సిరిసిల్ల పల్లెలు
- సినిమా ఆసాంతం ఇక్కడే చిత్రీకరణ
- నటనలో ఆకట్టుకున్న స్థానికులు
- కన్నీరు పెట్టించిన 'పక్షి' సన్నివేశం

సిరిసిల్ల చుట్టే సినిమా..

'బలగం' సినిమా షూటింగ్ 70శాతం సిరిసిల్ల చుట్టూనే సాగింది. సినిమాలో కనిపించే పెద్ద ఇల్లు కోనరావుపేట మండలం కొలనూర్‌లోనిది. కల్లు మండువ ధర్మారం, శవ ఊరేగింపు కనగర్తి, గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట, పక్షికి పెట్టే చోటు ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద చిత్రీకరించారు. తంగళ్లపల్లి, జిల్లెల్ల, సిరిసిల్ల శివారులోని జగ్గారావుపల్లె, సర్దాపూర్, కోనరావుపేట మండలం నాగారం, సుద్దాల గ్రామాల్లో షూటింగ్ చేశారు. చంద్రంపేట, జగ్గారావుపల్లె డప్పు కళాకారులు నృత్యాలు చేశారు. మానేరు వాగు, కోనరావుపేటలోని మూలవాగులోనూ సన్నివేశాలు చిత్రీకరించారు.

అందరూ స్థానికులే..

సినిమాలో యెల్దండి వేణు, డాక్టర్ వడ్డెపల్లి కృష్ణ (సినీ పాటల రచయిత), కీసరి నర్సింగం(నాగారం), పోరండ్ల మురళీధర్ (మాజీ సర్పంచ్ జిల్లెల్ల), ఆకునూరి దేవయ్య(గాయకుడు), జీఎల్.నాందేవ్(సంగీత దర్శకులు), కాయితి బాలు (సామాజిక వేత్త), నక్క శ్రీకాంత్ (గాయకుడు), బొడ్డు భాస్కర్, డి.సంజీవ్ (గాయకుడు), విద్యాసాగర్, రవి, కాయితి మిథున్, కాయితి శశాంక్, కాయితి కనకవ్వ, యాపిల్, కల్యాడపు రిత్విక్, కౌశిక్, పావని, మనస్విని నటించారు. ఇంకా సినిమాలో కనిపించే సైడ్ క్యారెక్టర్లు కూడా జిల్లా వాసులే.

ఇది నా డ్రీమ్ ప్రాజెక్టు..



సిరిసిల్లలో కూరగాయలు అమ్మిన నేను.. సినిమాలో నటుడిని కావాలనే కసితో హైదరాబాద్ వెళ్లాను. 25 ఏళ్లుగా అనేక సినిమాల్లో నటించాను. టీవీ షోల్లో పాల్గొన్నాను. కానీ మనసులో ఎక్కడో వెలితి ఉండేది. మా కుటుంబంలో జరిగిన ఘటనలు.. నాకు తెలిసిన కొన్ని అంశాలతో కథ రాసుకున్న. ఐదేళ్లుగా ఇదే పనిపై ఉన్న. ఇది నా డ్రీమ్ ప్రాజెక్టు.. సక్సెస్ చాలా సంతోషాన్ని ఇచ్చింది. – యెల్దండి వేణు, సినీ దర్శకుడు

నాటకాలు వేశాను



మాది హుజూరాబాద్ మండలం జూపాక. నేను బీఏ, బీఈడీ చేశాను. టీచర్‌గా పనిచేస్తూ.. కల్చరల్ విభాగానికి ఇన్‌చార్జిగా ఉన్నాను. నేను అనేక నాటకాలు వేశాను. ఇప్పటివరకు 35 సినిమాల్లో నటించాను. 'బలగం' సినిమా మంచి గుర్తింపునిచ్చింది. సంతోషంగా ఉంది. నాది ఇంకో సినిమా 'ముత్తయ్య' విడుదల కావాల్సి ఉంది. – కేతిరి సుధాకర్‌రెడ్డి, జూపాక, హుజూరాబాద్

లొకేషన్లు చూడడానికి వచ్చి..



మా అబ్బాయి శ్రీనివాస్ సిరిసిల్లలో అడ్వకేట్. అతనికి సినిమా దర్శకుడు వేణు స్నేహితుడు. మా ఊరులో సినిమా తీసేందుకు లొకేషన్లు చూడడానికి వచ్చి సినిమాలో నటించే అవకాశం కల్పించారు. గ్రామ సర్పంచ్ పాత్ర పోషించాను. మంచి సినిమాలో నటించడం చాలా సంతోషంగా ఉంది. – కీసరి నర్సింగం, నాగారం

నటించడం మొదటిసారి..



నేను నటించడం ఇదే తొలిసారి. గతంలో 'జ్యోతి', 'యమలోకంలో తెలంగాణ' వంటి సినిమాల్లో పాటలు పాడాను. గాయకుడిగా అనేక పాటలు పాడాను. కానీ సినిమాలో నటించడం తొలిసారి. మంచి సినిమాలో ఓ పాత్ర చేయడం ఆనందంగా ఉంది. వల్లు పట్టే పాత్రను ఇచ్చిన దర్శకుడు వేణుకు ధన్యవాదాలు. – ఆకునూరి దేవయ్య, గాయకుడు, సిరిసిల్ల

తెరపై చూసుకోవడం తొలిసారి



బలగం సినిమాలో పంచాయితీ పెద్దగా నటించడం సంతోషంగా ఉంది. సంగీత దర్శకుడిగా అనేక జానపదాలకు బాణీలు కట్టాను. ఎన్నో పాటలకు ప్రాణం పోశాను. వేణు చిత్రీకరించిన సినిమాలో నటించడం, తెరపై నన్ను నేను చూసుకోవడం, స్నేహితుల అభినందనలు సంతోషాన్ని ఇచ్చింది. – జీఎల్.నాందేవ్, సిరిసిల్ల

లాక్‌డౌన్ తరువాత ఇదే రికార్డు



సినిమాకు సిరిసిల్లలో కలెక్షన్లు రికార్డు స్థాయిలో వచ్చాయి. 16 రోజుల్లో రూ.22.43 లక్షలు వసూలైంది. 23వేల మంది సినిమా చూశారు. లాక్‌డౌన్ తరువాత ఇంత పెద్ద హిట్ సినిమాలు లేవు. ఇంకా హౌస్‌ఫుల్‌గానే నడుస్తోంది. పల్లెటూర్ల నుంచి చాలా మంది వచ్చి చూస్తున్నారు. నా 35 ఏళ్ల అనుభవంలో చిన్న సినిమా పెద్దహిట్ కావడం మొదటి సారి. – కంచర్ల వెంగయ్య, థియేటర్ మేనేజర్

సంతోషంగా ఉంది



మాది వరంగల్ జిల్లా దుగ్గొండి. మేం కళాకారులం. పాటలు పాడుతూ.. ఊరూరు తిరుగూ జీవనం సాగించే వాళ్లం. మా పాటలు విని డైరెక్టర్ వేణు మాకు అవకాశం కల్పించారు. 'బలగం' సినిమాలో పాట పాడడం చాలా సంతోషంగా ఉంది. సినిమాతో మాకు గుర్తింపు వచ్చింది. చాలా మంది మమ్మల్ని సన్మానించి, ఆర్థికంగా ఆదుకున్నారు. – బుర్రకథ కళాకారులు కొమురవ్వ, మొగిలయ్య, దుగ్గొండి

దేశం తెలంగాణ వైపు చూస్తోంది

- పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు
- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: తెలంగాణలో జరుగుతోన్న అభివృద్ధి మరెక్కడా జరగడం లేదని, దేశమే తెలంగాణ వైపు చూస్తోందని, అలాంటి పథకాలు ఇక్కడ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో గల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పనిచేసే నాయకులను మరువమని, పనిచేయని వారిని పక్కన పెట్టండన్నారు. మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు అందరు కలిసి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవాలని, పార్టీ బలోపేతానికి అందరు కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ సమన్వయ జిల్లా ఇన్‌చార్జి కోలేటి దామోదర్ మాట్లాడుతూ.. ఎక్కడ లేని విధంగా సాగునీటి రంగం, ప్రాజెక్టులు, అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, గత పాలకుల నిర్లక్ష్యం వల్లే అభివృద్ధి కుంటు పడిందని అన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, సీనియర్ నాయకులు జితేందర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, ఎమ్మెల్యేలు రవిశంకర్, విద్యాసాగర్‌రావు, సంజయ్

రైతు సంతోషమే ధ్యేయంగా పని చేయాలి

పెగడపల్లి: రైతుల సంతోషమే ధ్యేయంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పని చేయాలని సంక్షేమశాఖ మంత్రి ఈశ్వర్ సూచించారు. పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొనగా జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏఎంసీ చైర్మన్‌గా లోక నిర్మల- మల్లారెడ్డి, వైస్ చైర్మన్‌గా రాజు అంజనేయులు, మరో 12 మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పెగడపల్లిలో రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపం, నందగిరిలో సహకార సంఘం భవనం నిర్మాణానికి, అయితిపల్లిలో కల్వర్టు నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. నందగిరిలో నిర్మించిన 15 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేశారు. పెగడపల్లిలో రైతు వొరుగల రాజేశం వ్యవసాయ భూమిలో ఆయిల్‌పాం మొక్కలను నాటారు. డీసీఎంస్ చైర్మెన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, సర్పంచులు శ్రీనివాస్, రాకేశ్, కొండయ్య, ఎంపీటీసీ జమున, వైస్ ఎంపీపీ గంగాధర్, మార్కెట్ కార్యదర్శి ఫైజొద్దీన్ పాల్గొన్నారు.

జగిత్యాల ఖిలాను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

- కలెక్టర్ యాస్మిన్ బాషా



ఖిలాను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల: చారిత్రాత్మక జగిత్యాల ఖిలాను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం ఖిలాను సందర్శించారు. సాంస్కృతిక, చారిత్రాత్మక వారసత్వం గల జగిత్యాల ఖిలాను కాపాడుకోవాలన్నారు. అర్కిటెక్చర్, స్ట్రక్చర్ దెబ్బతినకుండా పురావస్తుశాఖ నిపుణుల సహాయంతో వైభవం ఉట్టిపడేలా పర్యాటకులను అమితంగా ఆకర్షించేలా జిల్లాకు ఎస్సెట్‌గా ఖిలాను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో మున్సిపల్, ఇతర ప్రభుత్వాల సమన్వయంతో సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను సిద్ధం చేసి అనుమతి కోసం ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. టూరిజం హబ్‌గా ఖిలాను మారిస్తే జగిత్యాలకు ఐకాన్‌గా ఉంటుందన్నారు. దాదాపు ఈ కోట 20 ఎకరాలస్థలంలో విస్తరించి ఉండటం, 90 ఫిరంగులు కొయ్యతో చేసిన పెద్ద గేటు, రహస్య గదులు, మంచినీళ్ల కోసం తవ్విన గదులు ఎంతో బాగున్నాయన్నారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ మకరంద్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఆర్డీవో మాధురి, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ నరేశ్, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ, ఆర్కియాలజీ ఏడీ సాగర్ పాల్గొన్నారు.

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్

జగిత్యాలటౌన్: టీఎస్‌పీఎస్సీ లీకేజీ వ్యవహారంలో హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో శనివారం మాట్లాడుతూ.. గవర్నర్ తన విచక్షణాధికారాలు ఉపయోగించి టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రెటరీలను విధుల నుంచి తొలగించాలని కోరారు. లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ జేబుసంస్థ అయిన సిట్ విచారణతో నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదని హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారికి ఏప్రిల్ నుంచి నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈడీ విచారణకు కవిత ఎందుకు జంకుతున్నారని, సోనియా లాంటి మహానేత ఈడీ విచారణ ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజంగి నందయ్య, నక్క జీవన్, పుప్పాల అశోక్, జున్ను రాజేందర్, చందా రాధాకిషన్, గుండ మధు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి పాటుపడుతున్న పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించి, కనీస వేతనం చెల్లించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని పశుమిత్రలు కలిసి వినతిపత్రం అందజేశారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల్లో చురుకుగా పాల్గొంటున్న సభ్యురాళ్లలో 2500మందిని ఎంపిక చేసిన ప్రభుత్వం పశుసంవర్ధకశాఖకు, పాడి యజమానులకు మధ్య వారధులుగా వినియోగిస్తోందని అన్నారు.

ప్రతికేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలి

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మెట్‌పల్లి సబ్ డివిజన్ డీఎస్పీ, సీఐలు, ఎస్సైలతో పెండింగ్ కేసులు, గ్రేవ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. పెండింగ్ కేసుల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్‌వోపీ ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలని సూచించారు. నేరాలను నియంత్రణలో సీసీ కెమెరాలు చాలా ముఖ్య పాత్ర ఉంటుందన్నారు. సీసీ కెమెరాల పనితీరును ప్రతిరోజూ చెక్ చేసుకోవాలని, పనిచేయని సీసీ కెమెరాల గుర్తించి మరమ్మతులు చేయించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే ప్రతి ఫిర్యాదును స్వీకరించి, ప్రజలకు సత్వర న్యాయం అందించాలన్నారు. ప్రాసిక్యూషన్‌లో భాగంగా కోర్టువారు జారీచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై, తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి కృషి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. అర్ధరాత్రి రోడ్లపై అనవసరంగా తిరుగుతూ, అసాంఘిక, చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న యువతే లక్ష్యంగా ముమ్మర తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు నిర్వహించాలని, పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాటి రద్దుకు రవాణాశాఖ అధికారులకు సిఫారసు చేయాలని సూచించారు. డీఎస్పీ రవీంద్రరెడ్డి, ఎస్బీఐ రాజశేఖర్‌రాజు, సీసీఎస్ సీఐ లక్ష్మీనారాయణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఐటీ కోర్ సీఐ సరిలాల్, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకునిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద శనివారం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌ను నిరసిస్తూ కలెక్టర్ కార్యాలయం ముట్టడికి బీజేపీ నాయకుడు యత్నించాడు. దీంతో కలెక్టర్ కార్యాలయంలోనికి వెళ్లకుండా అడ్డుకున్న కానిస్టేబుల్ రాజిరెడ్డి విధులకు ఆటంకం కలిగించిన బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. కలెక్టరేట్ వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీసు వాహనంపై ఎక్కి దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేశామన్నారు.

అటకెక్కిన పంటల బీమా పథకాలు

- ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో పంటల నష్టం
- రైతులకు తీవ్ర నష్టం



జగిత్యాలఅగ్రికల్చర్: ప్రతి ఏడాది జిల్లాలోని రైతులు అధిక వర్షాలు, బలమైన ఈదురుగాలులు వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు తమ కళ్ల ముందే ధ్వంసమై, కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొ ంది. రైతన్నకు అండగా ఉంటామన్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కనీసం పంటల బీమా పథకాలైనా ఆదుకుంటాయనుకుంటే అవి అటకెక్కాయి. దీంతో పంటనష్టపో యిన రైతులు తమ ఖర్మ అనుకుంటూ దేవుడిపై భారం వేస్తున్నారు.

నష్టపరిహారం ఇవ్వకుండా లేనిపోని నిబంధనలు..

పంటలకు నష్టం జరిగినప్పుడు ప్రభుత్వాలు పరిహారం అందించాలి. పరిహా రం అందించే ప్రయత్నాలను ప్రభుత్వా లు ఎప్పుడో మర్చిపోయాయి. దీనికి తోడు, పంట నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం లేనిపోని నిబంధనలు పెట్టింది. దీంతో, 33శాతానికి పైగా పంట నష్టపరిహారం వాటిల్లితేనే వ్యవసాయాధికారులు నివేదికలు తయారుచేసే పరిస్థితి ఉంది. ఒకవేళ నివేదికలను అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు పంపించినప్పటికీ పరిహారం అందడం గగనంగానే మారింది. ఈ ఏడాది వానాకాలంలో అధిక వర్షాలతో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్నప్పటికీ, అధికారులు నివేదికలకే పరిమితం చేశారు. దీంతో ప్రభుత్వం నుంచి రూపాయి వచ్చిన పాపాన పోలేదు. మళ్లీ యాసంగి సీజన్‌లో సాగుచేసిన మొక్కజొన్న, రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు నేలవాలి నష్టం వాటిల్లినప్పటికీ, ప్రభుత్వ నిబంధనల మేరకు పంటనష్టం జరగలేదని అధికారులు నివేదికలు రూపొందించడం లేదు. చివరకు రైతులకు పరిహారం అందించడం ఏమో కానీ రాజకీయ నాయకుల పరామర్శలే ప్రాప్తతంగా మారాయి.

అటకెక్కిన బీమా పథకాలు...

రైతులు వేసిన పంటలకు నష్టం జరిగినప్పుడు, పరిహారం ఇచ్చి ఆదుకునేందుకు, గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రెండు పంటల బీమా పథకాలు అమలయ్యేవి. మొదటిది.. పంటల బీమా పథకం(ఫసల్‌బీమా యోజన), రెండో ది.. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం. ఈ పథకాలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుండగా, మరికొంత రైతులు చెల్లించేవారు. ఈ పథకాలను ప్రభుత్వా లు ప్రవేశపెట్టినప్పటికీ, సరైన నిబంధనలు లేక రైతుల అభిమానాన్ని చూరగొనలేక పోయాయి.

పంటల బీమా పథకం రద్దు...

పంటలబీమా పథకంలో భాగంగా.. పంటరుణం పొందిన రైతుల నుంచి బ్యాంకులు ప్రీమియం వసూలు చేసి ఇన్సూరెన్స్ సంస్థలకు చెల్లించేవి. కానీ పంటనష్టం జరిగినప్పటికీ రైతులకు పరిహారం చెల్లించడంలో ఇన్సూరెన్స్ సంస్థలు మీనమేషాలు వేశాయి. దీనికి తోడు, పంట నష్టపోయిన రైతులను యూనిట్‌గా కాకుండా, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో, ఏ ఒక్క రైతుకు పంట నష్టపరిహారం రాలేదు. ఈ పథకంలో లోపాలున్నాయంటూ, ఈ పథకాన్ని రాష్ట్రప్రభుత్వం రద్దుచేసింది.

వాతావరణాధారిత బీమా...

అధిక ఉష్ణోగ్రతలు, వడగళ్లు, బలమైన ఈదురుగాలులు వంటి వాతావరణ మార్పులతో మామిడి, మిర్చి, పత్తి వంటి పంటలు నష్టపోతే, ఆయా పంటలకు నష్టపరిహారం వచ్చేలా ప్రభుత్వం వాతావరణ ఆధారిత పథకంను ప్రవేశపెట్టింది. ఈ పథకంలో రైతులు చేరినప్పటికీ, పంటనష్టం వాటిల్లితే ఆ నిబంధన, ఈ నిబంధన అంటూ ఇన్సూరెన్స్ సంస్థలు పరిహారం అందించేందుకు వెనుకంజ వే శాయి. ఇందుకు ప్రతీ మండలంలో ఏర్పాటుచేసి న వాతావరణ కేంద్రాలు అందించే సమాచారాన్నే ప్రమాణికంగా తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో పంటనష్టం జరిగినప్పటికీ, వాతావరణ కేంద్రం నుంచి సరైన సమాచారం రాకపోవడంతో పరిహారం ఇచ్చేందుకు ఇన్సూరెన్స్ సంస్థలు నిరాకరించాయి. దీనిపై రైతులు ఆందోళనలు చేశారు. దీంతో ఈ పథకాన్ని సైతం ప్రభుత్వం రద్దుచేసింది.

రాజకీయ పార్టీల కొత్త పాట

ఇటు అధికార పక్షం, అటు ప్రతిపక్షం అన్నదాతల కోసం కొత్త బీమా పథకాన్ని తీసుకవస్తామని హామీలు ఇస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న బీమా పథకాలు రైతులకు న్యాయం చేయలేకపోయాయ ని, రాబోయే రోజుల్లో రైతులందరికి అమోదయోగ్యమైన పంటల బీమా పథకాన్ని తీసుకవస్తామని భరోసా ఇస్తున్నారు. గ్రామాన్ని యూనిట్‌గా కా కుండా రైతును యూనిట్‌గా తీసుకుంటామని, రైతులు సాగు చేసిన ఏ పంటకు నష్టం జరిగినా ఇన్సూరెన్సు సంస్థ పరిహారం అందించేలా చూస్తా మని చెపుతున్నారు. అలాగే, ఇన్సూరెన్సు సంస్థకు చెల్లించే ప్రీమియాన్ని సైతం రైతులపై భారం పడకుండా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెపుతున్నారు. అయితే, ఆ పథకాలు వచ్చుడు ఎప్పుడో కాని ఇప్పుడైతే నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నష్టం జరిగితే పరిహారం ఇవ్వాలి

నేను రెండు ఎకరాల్లో వేసిన మొక్కజొన్న పంట నేలవాలింది. దీంతో, నాకు రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. ప్రస్తుతం ఇన్సూరెన్స్ పథకాలు అమలులో లేకపోవడంతో, ప్రభు త్వం నష్టపరిహారం అందించాలి. నాలాంటి ఎంతోమంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. – కోల నారాయణ, చల్‌గల్

ప్రభుత్వానికి నివేదిస్తాం



రైతులకు అమోద యోగ్యమైన ఇన్సూరెన్స్ పథకాలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వానికి నివేదిస్తాం. గతంలో ఇన్సూరెన్స్ పథకాలు ఉన్నప్పటికీ రైతులకు సరైన పరిహారం ఇవ్వకపోవడంతో ప్రభుత్వం, కొత్త బీమా పథకం కోసం ఆలోచనలు చేస్తోంది. – సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, జగిత్యాల

ఉపాధ్యాయుల కృషితో ఉత్తమ ఫలితాలు



పాఠశాలలను సందర్శించిన జిల్లా పరిశోధన బృందం

వెల్గటూర్: పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని, విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా పరిశీలకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముత్తునూర్, స్తంభంపల్లి, పాతగూడూర్ జెడ్పీపాఠశాలలతో పాటు, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమ నిర్వహణ, కనీస సామర్థ్యాల సాధన రికార్డుల పరిశీలన, ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రీఫైనల్ పరీక్షల సమాధాన పత్రాల పరిశీలన, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం విషయంలో సూచనలు చేశారు. పాఠశాలల నిర్వహణ, తల్లిదండ్రుల సమావేశాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు బాలగంగాధర్, రాజేశ్, రవీందర్, నీలం సంపత్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు జితేందర్, నర్సింగం, లచ్చయ్య, సత్తయ్య, మాధవి, వనిత, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ సీజ్



సీజ్‌చేస్తున్న కమిషనర్ సంతోష్‌కుమార్

రాయికల్: పట్టణంలోని చికెన్‌సెంటర్, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను శనివారం మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. కుళ్లిన మాసం స్టోర్‌చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను గుర్తించి లైసెన్స్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయనవెంట మేనేజర్ వెంకటి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్ ఉన్నారు.

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి



ర్యాలీగా వస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ఐటీ మంత్రి కేటీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు తులఉమ డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ తీరును నిరసిస్తూ శనివారం భారీ ర్యాలీగా తరలివచ్చిన బీజేపీ శ్రేణులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నాచేశారు. ఒక దశలో కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. నిరసన కారులను పక్కకు తోసేసిన డీఎస్పీ ప్రకాశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ.. నష్టపోయిన అభ్యర్థులకు రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని, సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని, మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని, టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి పోలీస్ వాహనం ఎక్కి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగ శ్రావణి, అలగుర్తి లక్ష్మీనారాయణ, మదన్‌మోహన్, భూమి రమణ, ఆముద రాజు, వీరబత్తిని అనిల్, రాగిళ్ల సత్యనారాయణ, రెంటం జగదీశ్ పెద్దసంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న గోపికృష్ణ

కోరుట్ల: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్రకార్యదర్శి శికారి గోపికృష్ణ తెలిపారు. ఈమేరకు శనివారం ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం చేపట్టిన సిట్ విచారణపై తమకు నమ్మకం లేదన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగకుంటే బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలు



గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం కిండర్‌గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్యాలు, పాటలు, నాటకాలు అలరించాయి. ఎం.సంతోష్ పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన పప్పెట్ షో ఆకట్టుకుంది. పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాల్లో విజేతలైన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ బహుమతులు అందించారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



నాగారాజును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం:మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న నాగారాజుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందించారు. అధ్యాపకుడు నాగారాజు తీలీపియా ముసంబియా చేపపై చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా నాగారాజును శనివారం ప్రిన్సిపాల్ సంజీవ్ కళాశాల అధ్యాపకులు సన్మానించి అభినందించారు.

పశు మిత్రల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పశుమిత్రలు

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి పాటుపడుతున్న పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షురాలు ఇందూరి సులోచన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట పశుమిత్రలు ధర్నాచేపట్టారు. సులోచన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో చురుకుగా పాల్గొంటున్న 2500 మందిని ఎంపిక చేసిన ప్రభుత్వం ఎలాంటి వేతనం లేకుండా ఊడిగం చేయిస్తోందని ఆరోపించారు. పశుసంవర్ధక శాఖకు, పాడి యజమానులకు మధ్య వారధులుగా పనిచేస్తున్న పశుమిత్రలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్డీవో లక్ష్మినారాయణ



మాట్లాడుతున్న డీఆర్డీవో

ధర్మపురి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్త్రీనిధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో లక్ష్మినారాయణ అన్నారు. ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పరిధిలోని సెర్ప్, స్త్రీనిధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి స్త్రీనిధి, ఎస్‌పీఏ, క్రెడిట్ ప్లాన్‌పై చర్చించారు. స్త్రీనిధి, సువిధ రుణాలపై సీసీ క్లస్టర్ వారిగా వీవోల వారిగా రివ్యూ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు సువిధ, స్త్రీనిధి రుణాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. స్త్రీనిధిలో తీసుకున్న రుణాలతో సంబంధ లేకుండా సువిధ నుంచి సంఘంలోని ప్రతీ మహిళకు రూ.40వేలు రుణం పొందవచ్చన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సుధీర్, స్త్రీనిధి ఆర్ఎం ఆనందరావు, డీపీఎంలు, వివిధ మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, వీవోలు తదితరులున్నారు.

ఇంటివద్దకే రాముని తలంబ్రాలు



రసీదు అందజేస్తున్న డీఎం

కోరుట్ల: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణం తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా ఇళ్ల వద్దకే చేరుస్తామని డిపోమేనేజర్ లక్ష్మీప్రసూన తెలిపారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఆర్టీసీ కార్యాలయంలో రూ.116 చెల్లిస్తే ఇంటికే భద్రాద్రి రాముని తలంబ్రాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవసరం ఉన్నవారు మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ సెల్ 9154298572, కోరుట్ల కార్గో కార్యాలయం సెల్ 9959105928 సంప్రదించాలన్నారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఈ సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవేజ్‌కు అభినందన



అభినందిస్తున్న రేవంత్‌రెడ్డి

మెట్‌పల్లి: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో చురుకుగా వ్యవహరించిన పట్టణానికి చెందిన పార్టీ నాయకుడు అవేజ్‌ను శుక్రవారం రాత్రి ఆర్మూర్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అభినందించారు. అత్యధిక సభ్యత్వాలు చేయించి బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేసినందుకు అవేజ్‌ను సన్మానించి అభినందించారు.

వ్యక్తిపై కేసు



చదును చేయడానికి సిద్ధం చేసిన భూమి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి అటవీప్రాంతంలో చెట్లు నరికి భూమిని సాగుచేసేందుకు సిద్ధం చేస్తున్న తాళ్లధర్మారం గ్రామానికి చెందిన గోపి చంద్రయ్య అనే వ్యక్తిపై అటవీశాఖ అధికారులు సెక్షన్ అధికారి గంగారాం, బీట్ అధికారి రాజేశం, బేస్ క్యాంపు సభ్యులు అతడి బైక్‌ను స్వాధీనం చేసుకుని, చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఎస్‌వో తెలిపారు.

అదుపుతప్పి కారుబోల్తా

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద శుక్రవారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి కాలువ పైనుంచి వెళ్లి కళాశాల ప్రహారీకి ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సారంగాపూర్ మండలం లచ్చక్కపేటకు చెందిన నలుగురు యువకులు శుక్రవారం రాత్రి ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా అర్ధరాత్రి అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డుపక్కనున్న మురికిగుంతలోకి వెళ్లి కళాశాల ప్రహరీని ఢీకొట్టి నుజ్జునుజ్జు అయింది. కారులో ఉన్న నలుగురు యువకులకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్ శివారులో విద్యుత్ షాక్‌తో మూడు గొర్రెలు మృతిచెందాయి. ఇదే మండలంలోని బతికపల్లికి చెందిన ఒరుగుల రాజమల్లు అనే రైతు శనివారం సాయంత్రం గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో గొర్రెలు మేస్తూ ఎర్త్‌వైర్ తగిలి మూడు గొర్రెలు అక్కడిక్కడే మృతిచెందాయి. రూ.30వేలు నష్టం వాటిల్లిందని ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు రాజమల్లు ప్రభుత్వాన్ని కోరాడు.